కోడిపందేల జోరు

- బరుల్లో నువ్వా? నేనా అంటూ తలపడుతున్న పందెం పుంజులు
- నిడదవోలు నియోజకవర్గంలో 25 బరులు
- రూ. కోట్లలో చేతులు మారుతున్న సొమ్ము



నల్లజర్ల మండలం అనంతపల్లిలో కోడిపందేలు

నిడదవోలు: సంక్రాంతి పండుగ ముసుగులో ఏటా నిర్వహించే కోడిపందేలు భోగి రోజైన ఆదివారం జోరుగా సాగాయి. పందేల నిర్వాహకులు కోళ్లకు కత్తులు కట్టి బరుల్లో రక్తపు టేరులు పారించారు. నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 25 బరుల్లో పందేలు ప్రారంభమయ్యాయి. పట్టణంలో 5, నిడదవోలు మండలంలో 7, ఉండ్రాజవరం మండలంలో 7, పెరవలి మండలంలో 7 బరులు ఏర్పాటు చేశారు. భోగి రోజున సుమారు రూ.మూడు కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా. ముఖ్యంగా యువత ఉత్సాహంగా కోడి పందేల్లో పాల్గొంటున్నారు.

నిడదవోలు రూరల్: మండలంలో కోడిపందేల బరుల ప్రాంతాల్లో రూ.లక్షలు చేతులు మారాయి. పందేలతో పాటు మరోపక్క గుండాటలతో పందెం రాయుళ్లు పండగ చేసుకున్నారు. డి.ముప్పవరంలో మూడు బరులు, తాడిమళ్ల, కోరుమామిడి, కాటకోటేశ్వరం, సింగవరం, విజ్జేశ్వరం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. పందేలను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. దీంతో బరులకు వెళ్లే దారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

పెరవలి: మండలంలో ఆదివారం నిర్వహించిన కోడి పందేల్లో సుమారు రూ.30 లక్షల నుంచి రూ.45 లక్షలు చేతులు మారాయని అంచనా. ఖండవల్లి, పిట్టల వేమవరం, పెరవలి, అజ్జరం, ముక్కామల, అన్నవరప్పాడు, వెంకట్రాయపురం గ్రామాల్లో నువ్వా? నేనా? అనే రీతిలో పందేలు సాగాయి. బరుల వద్దే నిర్వాహకులు మద్యం ఏర్పాట్లు కూడా చేశారు. కోడిపందేలు బోరు కొట్టిన వారు గుండాటల వద్ద, అక్కడ కూడా బోరు కొడితే మద్యం సేవించి కోతాటల్లో పాల్గొన్నారు. పలు బరుల వద్దకు కోడిపందేలను తిలకించడానికి మహిళలు కూడా తరలి వచ్చారు.

నల్లజర్ల: మండలంలో ఊరూరా కోడిపందేలు భోగి పండగ రోజైన ఆదివారం యథావిధిగా జరిగాయి. గుండాటకు మాత్రం ఎక్కడా పోలీసులు అనుమతించక పోవడంతో నాయకులు ఒకింత అసహనానికి గురయ్యారు. మధ్యాహ్నం తర్వాతే పందేలను ప్రారంభించారు. అయితే ఎక్కడా మునుపటి ఉత్సాహం కనబడలేదు. మండలంలోని నల్లజర్ల, అనంతపల్లి, పోతవరం, ప్రకాశరావుపాలెం, దూబచర్ల, గంటావారిగూడెం తదితర గ్రామాల్లో కోడిపందేలు జరిగాయి.

తాళ్లపూడి: పోలీసుల ఆంక్షల వల్ల మండలంలో కోడి పందేలు ఆదివారం కొంత ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, మలకపల్లి, వేగేశ్వరపురం, రావూరుపాడు తదితర ఎనిమిది ప్రాంతాల్లో పందేలు నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పందేల బరుల వద్దకు చేరుకున్నారు. పందెంలో ఓడిపోయిన కోజాలకు డిమాండ్ పెరిగింది. మలకపల్లిలో బరి వద్ద బౌన్సర్లను కూడా పెట్టి పందేలు నిర్వహించారు. తాళ్లపూడి, గజ్జరం గ్రామాల్లో పందే లకు తొలుత పోలీసులు అనుమతించలేదు. సంప్రదా యం ప్రకారం అనుమతి ఇవ్వాల్సిందే అంటూ టీడీపీ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.



నిడదవోలులో ఎల్ఈడీ స్క్రీన్‌పై కోడి పందేల ప్రత్యక్ష ప్రసారం



తాళ్లపూడి మండలం మలకపల్లి బరి వద్ద బౌన్సర్లు



ఖండవల్లిలో గుండాట ఆడుతున్న దృశ్యం



పెరవలి మండలం ఖండవల్లి బరిలో హోరాహోరీగా తలపడుతున్న కోళ్లు



దేవరపల్లిలో కోడి పుంజులను పందేలకు వదులుతున్న దృశ్యం

గోపాలపురం నియోజకవర్గంలోని 25 గ్రామాల్లో..

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కోడి పందేలను ప్రారంభించారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల్లో సుమారు 25 గ్రామాల్లో పందేలు నిర్వహిస్తున్నారు. మండలంలోని దేవరపల్లి, కురుకూరు, బందపురం, యర్నగూడెం, త్యాజంపూడి, యాదవోలు, సంగాయగూడెం గ్రామాల్లో భారీగా బరులను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పందె రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకూ జరుగుతున్నాయి. దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని పామాయిల్ తోటలో రెండు బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహిస్తున్నారు. పందేల బరులు జాతరను తలపిస్తున్నాయి. ఎక్కువగా యువత పందాల వైపు మొగ్గు చూపుతున్నారు.

కోజాలకు డిమాండ్

పందెంలో ఓడిపోయిన కోజాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కోజా మాంసం కోసం జనం ఎగబడుతున్నారు. కోజా మాంసం పసందుగా ఉంటుందని మాంసం ప్రియులు అంటున్నారు. కోజా ఒక్కొక్కటి మూడు నుంచి ఐదు కిలోల బరువు ఉంటుంది. దీని ఖరీదు రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకూ ధర పలుకుతుంది. అయినా దొరకని పరిస్థితి.

సంప్రదాయబద్ధంగా భోగి పండుగ

- దుంగలు సేకరిస్తూ సందడి చేసిన యువత
- చిన్నారులకు భోగి పండ్లతో ఆశీర్వాదాలు
- ఊరూరా మొదలైన సంక్రాంతి సంబరాలు

ఉండ్రాజవరం: భోగభాగ్యాలు అందించే భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉండ్రాజవరంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో భోగి మంటలతో సంక్రాంతి వేడుకలు సంప్రదాయబద్ధంగా ప్రారంభం అయ్యాయి. అర్ధ రాత్రి మూడు గంటల నుంచే యువకులు భోగి మంటల కోసం, కలప, దుంగలు, చెక్కలు సేకరిస్తూ సందడి చేశారు. తెల్లవారుజామునే భక్తి శ్రద్ధలతో భోగి మంటల్లో పిడకలు వేసి సంప్రదాయాన్ని చాటారు. పలు గ్రామాల్లో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. మండలంలో మోర్త సచివాలయం వద్ద సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర, పంచాయతీ సర్పంచ్ చిటికెన సుజని ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సెట్టింగులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జానీ నాగలక్ష్మి, వేలిగట్ల రాణి, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: భోగి పండగను మండల ప్రజలంతా ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్ల ముందు, వీధుల్లో దుంగలు, కలపతో భోగి మంటలు వేశారు. చిన్నారులు తలంటు స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించి భోగి మంటల్లో భోగి పిడకల దండలు వేసి మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. పిల్లలు, యువతులు ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మల మధ్యలో రాధాకృష్ణుల విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. చిన్నారులపై భోగి పండ్లు పోశారు. తాడిమళ్ల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామి దేవస్థానంలో నగర సంకీర్తన, స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు.

తాళ్లపూడి: గ్రామాల ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేశారు. హరినామ సంకీర్తనలు చేసుకుంటూ హరిదాసులు వీధుల్లో తిరిగారు. ప్రతి ఇంటి వద్దా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వారికి కానుకలు సమర్పించారు. సంక్రాంతి సందర్భంగా బంధువులు, కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లు కళ కళలాడుతున్నాయి. మహిళలు ఇళ్ల ముంగిటను రంగురంగుల ముగ్గులతో సుందరంగా అలంకరించారు. తాళ్లపూడిలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు.



ఉండ్రాజవరం మండలం మోర్తలో భోగిమంట వేస్తున్న పంచాయతీ, సొసైటీ పాలకవర్గ సభ్యులు

వేడుకగా గోదా రంగనాథుల కల్యాణం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి గోదా, రంగనాథస్వామి వారి కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకూ అత్యంత వైభవంగా ఈ వేడుకను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు.

నల్లజర్ల: ధనుర్మాసం సందర్భంగా అనంతపల్లి గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామివారి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుడు అగ్నిహోత్రుల సీతారామాచార్యులు, ఆలయ అర్చకుడు దివి పాండురంగశర్మ ఆధ్వర్యంలో ఉదయం పలురకాల పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామ సౌభాగ్యం, లోక కల్యాణార్థం ఏటా ఈ కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అర్చకుడు పాండురంగశర్మ తెలిపారు. అధికంగా భక్తులు హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ మద్దిరాల శరణ్య, చైర్మన్ కానుబోయిన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం అనంతపల్లి ఆనంద తిరుమల వేంకటేశ్వర్వ స్వామి ఆలయంలోను, తెలికిచెర్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు నిర్వహించారు.



దేవరపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద గోదా,రంగనాథస్వామి కల్యాణం



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న వివాహం కాని యువతీయువకులు

అన్నవరప్పాడులో..

పెరవలి: భోగి పండుగ సందర్భంగా ఆదివారం అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో వివాహం కాని 108 మంది యువతీ యువకులతో పూజలు చేయించుకుని, గోదాదేవి ఆశీస్సులు పొందారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ, అన్నవరప్పాడు సర్పంచ్ పంత బాలసుందరి, పంతం సత్యనారాయణ ఆధ్వర్యంలో భోగి మంట వేసి సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుట్టారు. భోగి పండుగ కావడంతో వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గజ వాహనంపై స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

పోతవరంలో కళాకారులకు సత్కారం

నల్లజర్ల: మండలంలోని పోతవరం రామాలయం వద్ద ఆదివారం పలువురు రంగస్థల కళాకారులను ఘనంగా సత్కరించారు. ఘంటసాల పాటల గాయకుడిగా పేరొందిన దంతోజు కృష్ణస్వామి ఆధ్వర్యంలో భోగి పండగ సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. రంగస్థల కళాకారులతో పాటు ఆలయ అర్చకుడు గోపీకిశోర్‌ను కూడా సన్మానించారు. ధనుర్మాసం నెల రోజులూ ఆలయంలో సేవ చేసిన బ్యాండు మేళం సభ్యులు నలుగురిని కూడా శాలువాలతో సత్కరించారు. సన్మాన గ్రహీతల్లో వాయిద్య కళాకారులు నింద్రకొలను నరసింహమూర్తి, పేరాళ్ల బైరాగి ఉన్నారు. అలాగే ఆలయం వద్ద తిరప్పావై చదివిన 20 మహిళల్ని ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి అంటేనే రంగవల్లులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలులో సంక్రాంతి సంబరాలు

నిడదవోలు: పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలని, సంక్రాంతి అంటేనే రంగవల్లులు గుర్తుకు వస్తాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని ఎన్‌సీఎస్ కార్యాలయం వద్ద ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, సీలం నాగేంద్రప్రసాద్, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

గణేష్ చౌక్ సెంటర్లో

గణేష్ చౌక్ సెంటర్లో శ్రీ పూజ గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద శనివారం రాత్రి నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరావు భోగి మంట వెలిగించి సంక్రాంతి వేడుకలు ప్రారంభించారు.

బ్రాహ్మణవీధిలో రోడ్డు సమస్యకు పరిష్కారం



దేవరపల్లి బ్రాహ్మణ వీధిలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దశాబ్ద కాలంగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం లభించిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండల పరిషత్ నిధులు రూ. 6 లక్షలతో స్థానిక బ్రాహ్మణవీధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే తలారి ప్రారంభించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, పెడసనగంటి ట్రస్ట్ చైర్మన్ పెడసనగంటి సాయిబాబు, పరమేశు బయోటెక్ పరిశ్రమ ఎండీ ఆనంద్ స్వరూప్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరపల్లిలో పేదలకు వస్త్రాల పంపిణీ



పెడసనగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక పెడసనగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లికి చెందిన పురోహితులు పెడసనగంటి సాయిబాబా, శశికాంత్ 11 ఏళ్ల క్రితం పెడసనగంటి ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని ఈ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు చేతుల మీదుగా 650 మంది పేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు అందజేశారు. దేవరపల్లిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరమేశు బయోటెక్ పరిశ్రమ అధినేత ఆనంద్ స్వరూప్, సర్పంచ్ కడిమి వీరకుమారి, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, ఆర్యవైశ్య సంఘ నాయకుడు తీగెల బలరామయ్య పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో దుప్పట్లు ..

తాళ్లపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రీజినల్ చైర్మన్, ఆ సంస్థ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ వాసిబోయిన చంద్రయ్య ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లి సూరమ్మ జ్ఞాపకార్థం వేగేశ్వరపురంలోని మేదరపేటలోని నిరుపేద వృద్ధులు 30 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శశిధర్ స్మారక క్రికెట్ టోర్నీ విజేత వెంకీ ఎలెవన్

ఉండ్రాజవరం: శశిధర్ మెమోరియల్ సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌లో నిడదవోలు వెంకీ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని వేలివెన్ను శశి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్స్ మ్యాచ్‌లో ఆ జట్టు ఉండ్రాజవరం పోసి టీమ్‌ను ఓడించింది. ఇక వాలీబాల్ పోటీల్లో తిమ్మరాజుపాలెం జోసెఫ్ జట్టుపై మునిపల్లి జట్టు విజయం సాధించింది. విజేతలకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు బహుమతులు అందజేశారు.

గోపవరంలో క్రీడా సంబరాలు

నిడదవోలు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని గోపవరం గ్రామంలో యువతకు ఆదివారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, చిన్న నంగాలు దంపతుల ఆధ్వర్యంలో నిర్వాహకులు షీల్డులు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంచదార దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు ఆరేపల్లి దుర్గా శ్రీను, ముప్పిడి సాయిప్రసాద్ పాల్గొన్నారు.